


# కడప మనస్సాక్షి

తెలుగు దినపత్రిక

PRGI Reg.No: APTEL/26/A0309

KADAPA MANASSAKSHI - Telugu Daily

వైయస్ఆర్ కడప/అన్నమయ్య   ఎడిటర్ : వసంత శ్రీనివాసుల రెడ్డి   సంపుటి : 01   సంచిక : 240   గురువారం, 03 సెప్టెంబర్ 2026   పేజీలు : 4   వెల.రూ.2/-




## ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు.. రైతుల కల సాకారం



అనకాపల్లి, సెప్టెంబరు 2: పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా గోదావరి జలాలు ఉత్తరాంధ్రలోకి ప్రవేశించడంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాయకరావుపేట క్రాస్ రెగ్యులేటర్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి గోదారమ్మకు జలహారతి ఇచ్చారు. అనంతరం కాలువలో ప్రవహిస్తున్న గోదావరి జలాలకు పుష్పాలు, పసుపు, కుంకుమ సమర్పించి సాష్టాంగ నమస్కారం చేశారు. గోదావరి జలాలకు స్థానికులు, రైతులు, మహిళలు ఘన స్వాగతం పలికారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, అనకాపల్లి జిల్లాల్లో 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 9 లక్షల మందికి తాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ముఖ్యమంత్రి తెలిపారు. ఎడమ కాలువ నిర్మాణానికి ఇప్పటివరకు రూ.4,192 కోట్లు ఖర్చు చేశామని, మరో రూ.800 కోట్లు వెచ్చించి మిగిలిన పనులను పూర్తి చేస్తామని చెప్పారు. ఏలేరు కాలువతో పాటు తాండవ, వరాహ, పాంపా నదులపై అవసరమైన నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో గోదావరి జలాలను ఉత్తరాంధ్ర సుజల స్రవంతితో అనుసంధానం చేసి మరింత విస్తరించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో తాను ముఖ్యమంత్రిగా ఉన్న ప్రతిసారీ సాగునీటి ప్రాజెక్టులు, జల సంరక్షణకు ప్రాధాన్యత ఇచ్చానని చంద్రబాబు పేర్కొన్నారు. నీరు సమృద్ధిగా ఉంటే పరిశ్రమలు, పెట్టుబడులు, ఉద్యోగాలు పెరుగుతాయని, విశాఖ–-అనకాపల్లి ప్రాంతాలు అభివృద్ధికి కేంద్రాలుగా మారనున్నాయని తెలిపారు. ఉత్తరాంధ్ర నుంచి వలసలు వెళ్లే పరిస్థితి కాకుండా ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పోలవరం ఎడమ కాలువ పనులను వేగంగా పూర్తి చేసేందుకు కృషి చేసిన జలవనరుల శాఖ ఇంజినీర్లను సత్కరించారు. కార్యక్రమంలో శాసనసభ స్పీకర్, మంత్రులు నిమ్మల రామానాయుడు, వంగలపూడి అనిత, పి.నారాయణ, కె.అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, కె.పార్థసారథి, ఎంపీలు విజయ్, సీఎం రమేష్ తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు



అమరావతి, సెప్టెంబరు 2: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను అభిమానులు, జనసైనికులు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్‌తో పాటు పలువురు ప్రముఖులు పవన్ కల్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాని మోదీ పవన్ కల్యాణ్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రజల్లో ఎంతో గౌరవం ఉన్న ఆయన ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వ సుపరిపాలనకు తోడ్పడుతున్నారని, సమాజ సేవలో ఆయన ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పవన్ కల్యాణ్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పంచాయతీరాజ్ శాఖలో అనేక సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలతో మార్పు తీసుకొస్తున్నారని, గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం నుంచి పచ్చదనం పెంపు వరకు ఆయన చేపడుతున్న కార్యక్రమాలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రజలకు కూటమి ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు పవన్ కల్యాణ్ నిరంతరం కృషి చేస్తున్నారని చంద్రబాబు కొనియాడారు. పవన్ జన్మదినాన్ని పురస్కరించుకుని జనసేన యువజన విభాగం కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. సామాజిక మాధ్యమాల్లోనూ పవన్ కల్యాణ్‌కు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి.

## ఇడుపులపాయలో వైఎస్సార్‌కు జగన్, షర్మిల నివాళులు



వేంపల్లి, సెప్టెంబరు 2: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతిని పురస్కరించుకుని ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలోని వైఎస్సార్ ఘాట్ వద్ద మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వేర్వేరుగా నివాళులర్పించారు. బుధవారం ఉదయం పులివెందుల నుంచి రోడ్డు మార్గంలో ఇడుపులపాయకు చేరుకున్న జగన్ మోహన్ రెడ్డి తల్లి విజయమ్మ, సతీమణి భారతితో కలిసి వైఎస్సార్ సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులతో కరచాలనం చేశారు. ఆ తర్వాత హెలికాప్టర్‌లో బెంగళూరుకు బయలుదేరి వెళ్లారు. జగన్ వెళ్లిన అనంతరం షర్మిల తల్లి విజయమ్మతో కలిసి వైఎస్సార్ ఘాట్‌కు చేరుకుని ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని తండ్రి సమాధికి నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులతో కరచాలనం చేశారు. ఇరువురు నేతలు వేర్వేరుగా ఘాట్‌కు రావడంతో ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కిటకిటలాడింది. భద్రతా దృష్ట్యా పులివెందుల ఉప పోలీసు అధికారి మురళీ నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్ నాయకులు వైఎస్సార్‌కు నివాళులర్పించారు.

## మొక్కలే మానవుడి జీవిత నేస్తాలు



చిలకలూరిపేట, సెప్టెంబరు 3: రాబోయే 20 ఏళ్లలో ఆంధ్రప్రదేశ్‌ను పచ్చదనంతో కళకళలాడే రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఏపీ గ్రీన్ సొసైటీ కార్యనిర్వాహక కమిటీ చైర్మన్, శాసనమండలి సభ్యుడు కొణిదల నాగబాబు పిలుపునిచ్చారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని చిలకలూరిపేటలోని ఆర్.వి.ఎస్.సి.వి.ఎస్ పాఠశాలలో ఏపీ గ్రీన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'వన క్షేమం--జన క్షేమం' కార్యక్రమంలో ఆయన విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ చెట్లు పర్యావరణ మార్పులను సమతుల్యం చేయడంతో పాటు మానవ జీవన ప్రమాణాలను మెరుగుపరిచే గొప్ప శక్తి కలిగినవని అన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణం అందించేందుకు చిన్నారుల్లో మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం అలవాటుగా మార్చాలని సూచించారు. పర్యావరణాన్ని నిర్లక్ష్యంగా ధ్వంసం చేసిన గత తరాలు ప్రస్తుత తరానికి అన్యాయం చేశాయని, ఇకపై చెట్లను మానవ జీవితంలో భాగంగా భావించి సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఒక మొక్క పెరిగి చెట్టుగా మారిన తర్వాత అందించే ఆక్సిజన్, కార్బన్ డై ఆక్సైడ్‌ను గ్రహించడం, నేలను సారవంతం చేయడం వంటి ప్రయోజనాలను లెక్కిస్తే దాని విలువ ఎంతో ఎక్కువని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తనపై ఉంచిన బాధ్యతలను నెరవేర్చి రాష్ట్రాన్ని పచ్చగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో చిలకలూరిపేట ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు, పాఠశాల కరస్పాండెంట్ మైలవరపు శివానంద కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కడపలో ఘనంగా పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు







కడప, సెప్టెంబరు 2: జనసేన పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను కడప నగరంలో జనసేన నాయకులు, వీర మహిళలు, జనసైనికులు ఘనంగా నిర్వహించారు. శ్రీ జీవీ రమణ ఆధ్వర్యంలో వందలాది ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు, ట్రాక్టర్లు, శకటాలతో భారీ ర్యాలీ నిర్వహించి జనసేన పార్టీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాగస్వామ్యంలో చేపడుతున్న అభివృద్ధి, యువత సాధికారత, భవిష్యత్ తరాల సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కడప ఐఎంఏ మందిరంలో భారీ తెర ఏర్పాటు చేసి రాష్ట్ర నాయకత్వ ప్రసంగాన్ని జనసైనికులు వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. అనంతరం భోజన సదుపాయం కల్పించి యువతలో చైతన్యం, ధైర్యం నింపేలా కార్యక్రమాలు నిర్వహించారు. భారతదేశ ఔన్నత్యాన్ని పెంపొందించేలా పవన్ కల్యాణ్ సంకల్పానికి మద్దతుగా నిలవాలని నాయకులు పిలుపునిచ్చారు. అనంతరం జనసేన నాయకులు, వీర మహిళలతో కలిసి భారీ కేక్ కట్ చేసి పవన్ కల్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కడప జనసేన నాయకులు ఆకుల గోపి, బోశెట్టి సాయి, స్వరూప్, మహేంద్రసింగ్, అబ్బన్నగర్ రాజగోపాల్, సాయి వినయ్, ఆకుల వీధి మహేష్, తోట సుమన్, ఉంగరాల విజయ్, నాగరాజు, ఉదయ్, శ్రీ విజయలక్ష్మి తదితరులు, జనసేన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కడప మనస్సాక్షి తెలుగు దినపత్రిక
PRGI Reg.No: APTEL/26/A0309
KADAPA MANASSAKSHI - Telugu Daily



# జి.ఉప్పలపాడు గ్రామంలో 'పల్లె నిద్ర' కార్యక్రమం



కడప, సెప్టెంబరు 2: జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు తలమంచిపట్నం ఎస్ఐ హైమావతి ఆధ్వర్యంలో జి.ఉప్పలపాడు గ్రామంలో 'పల్లె నిద్ర' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు గ్రామ ప్రజలతో మమేకమై రానున్న పంచాయతీ ఎన్నికలపై అవగాహన కల్పించారు. ఎన్నికల సమయంలో ప్రజలు శాంతియుత వాతావరణాన్ని పాటిస్తూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. మహిళల భద్రతకు ఉపయోగపడే శక్తి యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించాలి




కడప, సెప్టెంబరు 2: రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజల ప్రాణాల రక్షణే లక్ష్యంగా వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ సూచించారు. జిల్లా వ్యాప్తంగా బుధవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 395 కేసులు నమోదు చేసి రూ.88,075 జరిమానా విధించినట్లు తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే ప్రతి ఒక్కరూ సీట్‌బెల్ట్ ధరించాలని సూచించారు. రాంగ్‌రూట్‌లో వాహనాలు నడపడం, వాహనం నడుపుతూ మొబైల్‌ఫోన్ వినియోగించడం, అధిక వేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి వాటికి దూరంగా ఉండాలని హెచ్చరించారు. ట్రాఫిక్ సిగ్నల్స్, రహదారి సూచనలు తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని ఎస్పీ స్పష్టం చేశారు.

# టెలికాం నగర్‌లో జూదం ఆడుతున్న 11 మంది అరెస్ట్



కడప, సెప్టెంబరు 2: రిమ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని టెలికాం నగర్‌లో జూదం ఆడుతున్న 11 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు, కడప డీఎస్పీ బాలస్వామిరెడ్డి సూచనలతో రిమ్స్ సీఐ రాజగోపాల్ ఆధ్వర్యంలో ఈ దాడి నిర్వహించారు. నిందితుల నుంచి రూ.76,270 నగదు, 10 సెల్‌ఫోన్లు, 5 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లాలో జూదం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రాజగోపాల్ తెలిపారు.

# నారేపల్లి గ్రామంలో మహిళా భద్రత, సైబర్ మోసాలపై అవగాహన

కడప, సెప్టెంబరు 2: జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు వేముల ఎస్ఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో వేముల మండలం నారేపల్లి గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళల భద్రత, సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నిబంధనలను వివరించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడకుండా ప్రశాంత వాతావరణం కొనసాగేందుకు పోలీసులకు సహకరించాలని సూచించారు.

# ఒంటిమిట్ట ఎస్సీ కాలనీలో అవగాహన కార్యక్రమం

ఒంటిమిట్ట: జిల్లా ఎస్.పి. శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఐ.పి.ఎస్. గారి ఆదేశాల మేరకు ఒంటిమిట్ట ఎస్.ఐ. శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఒంటిమిట్ట ఎస్సీ కాలనీలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలపై నేరాలు, సైబర్ మోసాలు, చిట్‌ఫండ్ మోసాలు, ట్రాఫిక్ నిబంధనలు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100, 112 సేవలను వినియోగించుకోవాలని, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.

# ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలి

మదనపల్లె, సెప్టెంబరు 2: జిల్లాలో ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలను




పకడ్బందీగా అమలు చేయడంతో పాటు బల్క్ వ్యర్థాల ఉత్పత్తిదారులందరూ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ప్రత్యేక విభాగం సమావేశాన్ని బుధవారం కలెక్టరేట్‌లో వీడియో సమావేశం ద్వారా నిర్వహించి వ్యర్థాల సేకరణ, విభజన, శాస్త్రీయ ప్రాసెసింగ్, డంపింగ్‌పై సమీక్షించారు. జిల్లాలో రోజుకు 147.50 టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి అవుతుండగా ప్రస్తుతం 36.80 టన్నులు మాత్రమే ప్రాసెసింగ్ అవుతున్నాయని, మిగిలిన 110.70 టన్నులు డంప్‌సైట్‌కు తరలుతున్నాయని అధికారులు తెలిపారు. డంపింగ్‌ను తగ్గించి ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని పెంచాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 46 బల్క్ వ్యర్థాల ఉత్పత్తిదారులను గుర్తించగా, ఇంకా అర్హత కలిగిన సంస్థలను పునఃసర్వే ద్వారా గుర్తించి నమోదు చేయాలని ఆదేశించారు. బల్క్ వ్యర్థాల ఉత్పత్తిదారులు తమ సంస్థల్లోనే తడి వ్యర్థాల శాస్త్రీయ ప్రాసెసింగ్ ఏర్పాట్లు అక్టోబరు 31లోగా పూర్తి చేయాలని, నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి, పారిశుద్ధ్య, ప్రత్యేక సంరక్షణ వ్యర్థాలను నాలుగు రకాలుగా వేరు చేసి అందించేలా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. నాలుగు మున్సిపాలిటీల్లో ప్రతి వారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలను భాగస్వామ్యం చేయాలని ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి జిల్లాను పరిశుభ్రంగా, పర్యావరణహితంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు.

# కేంద్ర పథకాల అమలులో వేగం, పారదర్శకతకు ప్రాధాన్యత

మదనపల్లె, సెప్టెంబరు 2: కేంద్ర ప్రాయోజిత పథకాలను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేసి అర్హులైన ప్రజలకు పూర్తిస్థాయిలో ప్రయోజనం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రాజంపేట పార్లమెంటు సభ్యుడు, జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ చైర్మన్ పి.వి. మిథున్ రెడ్డి ఆదేశించారు. మదనపల్లె కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌తో కలిసి నిర్వహించిన సమావేశంలో వివిధ శాఖల పథకాల పురోగతిని సమీక్షించారు. ఉపాధి హామీ పథకంలో పనిదినాలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని, అర్హులైన కుటుంబాలకు పారదర్శకంగా ఉపాధి కల్పించాలని సూచించారు. కరువు పరిస్థితుల దృష్ట్యా తాగునీరు, సాగునీరు, పశువులకు దాణాకు ప్రాధాన్యత ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న తాగునీటి పనులు, బిల్లులను త్వరగా పరిష్కరించాలని తెలిపారు. ప్రజా ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని, శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ సూచించారు. గృహ నిర్మాణాలను వేగవంతం చేసి అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో ఇళ్లు అందించాలని, ఖాళీగా ఉన్న గృహ స్థలాలను పరిరక్షించాలని ఎంపీ ఆదేశించారు. టమాటా రైతులకు మార్కెటింగ్, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని, పంటల బీమాపై రైతుల్లో అవగాహన పెంచాలని సూచించారు. విద్యుత్ శాఖలో పెండింగ్ దరఖాస్తులు, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను పారదర్శకంగా పరిష్కరించాలని, ఎంపీ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులను నిర్ణీత సమయంలో నాణ్యతతో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నిధుల దుర్వినియోగం, అవినీతి, అక్రమాలకు తావులేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు.

# స్థానిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో 'పల్లె నిద్ర'



కడప, సెప్టెంబరు 3: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పడమే లక్ష్యంగా అన్నమయ్య జిల్లా ఎస్పీ శ్రీ ధీరజ్ కునుబిల్లి, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు యంత్రాంగం 'పల్లె నిద్ర' కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా పోలీసులు గ్రామాల్లో పర్యటించి రాత్రి వేళల్లో అక్కడే బస చేస్తూ ప్రజలతో నేరుగా మమేకమవుతున్నారు. మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, దొంగతనాల నియంత్రణ, బాల్య వివాహాల కట్టడి తదితర అంశాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. గ్రామాల్లోకి అనుమానాస్పదంగా కొత్త వ్యక్తులు వచ్చినట్లు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక శక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# ఎంపీ మిథున్ రెడ్డిని కలిసిన ఎస్.ఏ.కరీముల్లా కుటుంబ సభ్యులు

మదనపల్లె : దిశా సమావేశంలో పాల్గొనేందుకు అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లెకి విచ్చేసిన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని బుధవారం అన్నమయ్య జిల్లా వక్ఫ్ బోర్డ్ మాజీ చైర్మన్,ఉమ్మడి చిత్తూరు జిల్లా బీఎస్ఎన్ఎల్ అడ్వైజరీ కమిటీ మెంబర్ ఎస్.ఏ కరీముల్లా ఆయన సతీమణి మాజీ కౌన్సిలర్ షేక్ షబానాలు మర్యాదపూర్వకంగా కలిశారు.ముందుగా ఎంపీ వారిని ఆప్యాయంగా పలకరించారు.ఈ సందర్భంగా ఎస్.ఏ కరీముల్లా మాట్లాడుతూ ఎంపీ మిథున్ రెడ్డి అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకుడని,ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు.మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డితో ఎంపీది ప్రత్యేక అనుబంధమన్నారు.ఎంపీ సూచనలు,సలహాలు తనకు రాజకీయంగా ఎంతో దోహదపడుతాయని,త్వరలో జరుగబోవు స్థానిక సంస్థల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐడిసి మాజీ డైరెక్టర్ దండాల రవి చంద్రారెడ్డి,దిశ మెంబెర్ బి.నాగిరెడ్డి,రఫీ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా టైలర్‌కు కుట్టు మిషన్ పంపిణీ




కడప, సెప్టెంబరు 2 మనస్సాక్షి: లలిత కళాభిరామ పింఛం సంస్థ ఆధ్వర్యంలో ప్రతిభ కలిగిన మహిళలను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా చింతపుతాయపల్లెకు చెందిన మహిళా టైలర్ లక్కినేని యశోద మనోహర్ కుటుంబానికి లేటెస్ట్ మోడల్ దివ్య కుట్టు మిషన్‌ను పంపిణీ చేశారు. కుట్టు, అల్లికల రంగంలో ప్రత్యేక నైపుణ్యం కలిగిన యశోద మనోహర్ తన ప్రతిభను మరింత మెరుగుపరుచుకుని భవిష్యత్తులో ఆకర్షణీయమైన డిజైన్ దుస్తులను తయారు చేస్తూ మంచి అభివృద్ధి సాధించాలని సంస్థ సభ్యులు ఆకాంక్షించారు. బెంగళూరుకు చెందిన సీనియర్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ముండ్లపాటి వెంకటశివ, సౌజన్య చేతుల మీదుగా కుట్టు మిషన్‌ను అందజేశారు. సభాధ్యక్షులు, కళారత్న డాక్టర్ గొల్లపల్లి జయన్న మాట్లాడుతూ గ్రామాల్లో ఎంతో ప్రతిభ, నైపుణ్యం ఉన్నప్పటికీ సరైన ప్రోత్సాహం లేక చాలామంది అక్కడికక్కడే ఆగిపోతున్నారని అన్నారు. నైపుణ్యం కలిగిన వారిని ప్రోత్సహిస్తే వారు తమ భవిష్యత్తును మెరుగుపరుచుకోవడంతో పాటు ఇతరులపై ఆధారపడకుండా స్వయం ఉపాధితో జీవించగలరని పేర్కొన్నారు. సంస్థ ఉపాధ్యక్షులు గొల్లపల్లి గురయ్య మాట్లాడుతూ చిన్ననాటి నుంచి కష్టపడి కళారంగంలో మంచి పేరు సంపాదించిన కళారత్న డాక్టర్ గొల్లపల్లి జయన్న సేవా కార్యక్రమాలు నిర్వహించాలనే ఆలోచన అభినందనీయమన్నారు. ప్రధాన కార్యదర్శి మంజుల రాణి మాట్లాడుతూ గ్రామీణ మహిళల్లో అపారమైన ప్రతిభ ఉందని, పట్టుదలతో ముందుకు సాగితే వారు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు విష్ణువర్ధన్, ఇంజనీర్ తిరుపతి, గ్రామ పెద్దలు రాజన్న, మరియదాస్, చైతన్య కిరణ్, బి. జయమ్మ, గుంతపల్లి క్లస్టర్ సభ్యులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన స్పాన్సర్లు, అతిథులు, గ్రామస్తులకు సంస్థ జాయింట్ సెక్రటరీ గొల్లపల్లి శ్రీకాంత్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# క్రిస్టియన్ మైనారిటీల సమస్యల పరిష్కారానికి వైకాపా ప్రత్యేక చొరవ

మదనపల్లె : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సమావేశం బుధవారం మదనపల్లెలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ సమన్వయకర్త నిసార్ అహ్మద్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు.క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు జాన్ వెస్లీ ముఖ్య అతిథిగా జరిగిన ఈ సమావేశంలో పార్టీ నాయకులు,మైనారిటీ సెల్ ప్రతినిధులు,వైఎస్సాఆర్ సిపి శ్రేణులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ క్రిస్టియన్ మైనారిటీల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని,వాటి పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయడమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.మైనారిటీ వర్గాల సంక్షేమం,విద్య,ఉపాధి, స్వయం ఉపాధి,సామాజిక భద్రత తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి మైనారిటీల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారని,ఆయన చూపిన సంక్షేమం,సామాజిక న్యాయం,మానవతా విలువలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముందుకు తీసుకెళ్తుందని నాయకులు పేర్కొన్నారు.పేద క్రైస్తవ కుటుంబాలు,విద్యార్థులు,యువతకు అందాల్సిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో చేరేలా పార్టీ నాయకులు,కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.అనంతరం పార్టీ సమన్వయకర్త ఎస్.నిసార్ అహ్మద్ మాట్లాడుతూ క్రైస్తవులు విద్యా వైద్య రంగాలలో ఎనలేని సేవలు అందిస్తున్నారని,సమాజంలో వారికి ప్రత్యేక స్థానం ఉందన్నారు.మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి వి.ఎస్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి మండలం,గ్రామ స్థాయిలో క్రిస్టియన్ మైనారిటీ సెల్‌ను మరింత బలోపేతం చేసి,ప్రజలతో నిరంతరం మమేకమై పనిచేయాలని నాయకులు సూచించారు.జి

కడప మనసాక్షి
PRGI Reg.No: APTEL/26/A0309
తెలుగు దినపత్రిక
KADAPA MANASSAKSHI - Telugu Daily



## మహిళలు ఆర్థికంగా, ఆరోగ్యంగా ఎదిగితేనే సమాజ ప్రగతి




జమ్మలమడుగు, సెప్టెంబరు 2: మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించడంతో పాటు ఆరోగ్యం, విద్య, భద్రతపై అవగాహన పెంచుకున్నప్పుడే కుటుంబం, సమాజం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అన్నారు. జమ్మలమడుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన మహిళాబాగు--సంభాషణ కార్యక్రమంలో ఎమ్మెల్యే సి. ఆదినారాయణరెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. మహిళలు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయరాదని, పోషకాహారానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. బాలికల చదువును మధ్యలో ఆపి బాల్య వివాహాలు చేయకుండా ఉన్నత విద్య అందించాలని కోరారు. స్వయం సహాయక సంఘాల ద్వారా పొందుతున్న రుణాలను పెట్టుబడులుగా వినియోగించి ఆదాయ మార్గాలను పెంచుకోవాలని సూచించారు. జిల్లాలో మహిళా సంఘాలకు సుమారు రూ. 2,200 కోట్ల రుణాలు అందినట్లు తెలిపారు. జమ్మలమడుగు ప్రాంతంలో రానున్న పరిశ్రమలు, ప్రాజెక్టులతో యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. గండికోట పర్యాటక అభివృద్ధితో స్థానికంగా వ్యాపార అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రిలో త్వరలో మత్తుమందు వైద్యుని నియమిస్తామని వెల్లడించారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే సి. ఆదినారాయణరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. మహిళా లబ్ధిదారులకు భారీ చెక్కును అందజేశారు.

## డెంటల్ క్లినిక్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్





కడప, సెప్టెంబరు 2: కడప నగరంలో నవీ డెంటల్ కేర్ క్లినిక్‌ను జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి బుధవారం ప్రారంభించారు. క్లినిక్‌లో రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం నిర్వహించిన అనంతరం దంత వైద్యులు డా. మేరువ వెంకట నవీన్‌ను కలెక్టర్ అభినందించారు. ఆధునిక సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ కడప జిల్లా ప్రజలకు మెరుగైన దంత వైద్య సేవలు అందించాలని ఆయన సూచించారు.

## ఎస్ఐఆర్--2026 ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలి



కడప, సెప్టెంబరు 2: ఎస్ఐఆర్--2026లో భాగంగా ఓటర్ల జాబితాకు సంబంధించి అందిన దావాలు, అభ్యంతరాలను నిబంధనల మేరకు క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా పరిష్కరించాలని కడప ఆర్డీఓ, ఎన్నికల నమోదు అధికారి మురళి అధికారులను ఆదేశించారు. కడప ఆర్డీఓ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దావాలు, అభ్యంతరాలపై విచారణలను నిర్ణీత విధానాల ప్రకారం చేపట్టి, సంబంధిత వ్యక్తులకు నోటీసులను సకాలంలో అందజేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరుకు న్యాయం జరిగేలా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన ఎన్నికల సంబంధిత అంశాలను నిబంధనల మేరకు పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓటర్ల జాబితా సవరణలో పూర్తి పారదర్శకత పాటిస్తూ రాజకీయ పార్టీలకు అవసరమైన సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. సమావేశంలో సహాయ ఎన్నికల నమోదు అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన ప్రధాన జిల్లా న్యాయమూర్తికి మునిసిపల్ కమిషనర్ శుభాకాంక్షలు



కడప, సెప్టెంబరు 2: కడప జిల్లాకు నూతనంగా నియమితులై బాధ్యతలు స్వీకరించిన ప్రధాన జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి జి. రామగోపాల్‌ను కడప మునిసిపల్ కమిషనర్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కడప నగరంలో వీధి కుక్కల సమస్యపై న్యాయమూర్తి ఆరా తీసి, తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం నగరానికి సంబంధించిన పలు అంశాలపై ఇరువురు పరస్పరం చర్చించారు.

## ప్రభుత్వ బాలుర వసతి గృహం, పరిశీలన గృహం తనిఖీ



కడప, సెప్టెంబరు 2: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ కడప నగరంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహం, ప్రభుత్వ పరిశీలన గృహాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పరిసరాలు, వసతి గదులు, వంటశాల, మరుగుదొడ్లు, ఆహారం, ఆరోగ్యం, పరిశుభ్రత, భద్రత, మౌలిక సదుపాయాలను పరిశీలించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యను విలువైనదిగా భావించి క్రమశిక్షణతో అభ్యసించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో బాలల సంరక్షణ కోసం జాతీయ న్యాయ సేవాధికార సంస్థ రూపొందించిన స్నేహపూర్వక న్యాయ సేవల పథకం--2024పై అవగాహన కల్పించారు. న్యాయ సేవల సహాయవాణి 15100, బాలల సహాయవాణి 1098 ద్వారా సహాయం పొందవచ్చని, ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉందని తెలిపారు. ఏవైనా సమస్యలు ఎదురైతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, వసతి గృహం, పరిశీలన గృహం సూపరింటెండెంట్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌పై న్యాయమూర్తులతో ముందస్తు సమావేశం



కడప, సెప్టెంబరు 2: ఈ నెల 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు ఉమ్మడి కడప జిల్లా మండల స్థాయి న్యాయమూర్తులతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. రామగోపాల్ ముందస్తు వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీ కాగల కేసులను గుర్తించి, అధిక సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాల మేరకు పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ చలానాలను ఈ నెల 12న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో సంబంధిత పరిధిలోని బెంచ్ ద్వారా రాజీ చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి ఎస్. బాబా ఫక్రుద్దీన్‌తో పాటు ఉమ్మడి కడప జిల్లా మండల స్థాయి న్యాయమూర్తులు పాల్గొన్నారు.

## జాతీయ కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలి

కడప, సెప్టెంబరు 2: జిల్లాలో జాతీయ కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి, వ్యాధి నియంత్రణ చర్యలను కట్టుదిట్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి వైద్య, మున్సిపల్ శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సెప్టెంబరు 11 నుంచి 24 వరకు నిర్వహించనున్న 14 రోజుల కార్యక్రమం సన్నద్ధతపై సమీక్ష నిర్వహించి, ప్రచార గోడపత్రికను ఆవిష్కరించారు. ప్రతి ఇంటినీ ఆరోగ్య కార్యకర్తలు బృందాలుగా సందర్శించి వంద శాతం పక్కాగా సర్వే నిర్వహించాలని, ఒక్క కేసు కూడా గుర్తింపునకు దూరం కాకుండా చూడాలని సూచించారు. వ్యాధి లక్షణాలు ఉన్నవారిని వెంటనే గుర్తించి తగిన వైద్య చికిత్స అందించాలని, అంగవైకల్యం రాకుండా సకాలంలో వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. జిల్లాలో కుష్టు వ్యాధి కేసులు తగ్గుముఖం పట్టడం పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్, భవిష్యత్తులో జిల్లాను కుష్టు రహితంగా మార్చడమే లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జునుడు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. పి. యుగంధర్, జిల్లా కుష్టు వ్యాధి నియంత్రణ అధికారి డా. రవి బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## లింగ వివక్షపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి




కడప, సెప్టెంబరు 2: లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో లింగ వివక్షపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి శ్రీనివాస నాయక్ సూచించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి బహుళ సభ్యుల సముచిత అధికారం, జిల్లా సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివాహ, జనన నమోదు చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించి, వివాహమైన ప్రతి దంపతులు తప్పనిసరిగా వివాహ ధ్రువీకరణ పత్రం పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జునుడు మాట్లాడుతూ స్త్రీ, పురుష నిష్పత్తిలో సమతుల్యత సాధించేందుకు గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం--1994ను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడే వైద్యులు, సిబ్బంది, స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులతో పాటు ప్రోత్సహించే, సహకరించే వ్యక్తులపైనా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. యుగంధర్, అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తల్లి మరణాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి




కడప, సెప్టెంబరు 2: జిల్లాలో తల్లి మరణాలను పూర్తిస్థాయిలో నివారించేందుకు వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి మాతృ మరణాల సమీక్ష సమావేశంలో గత ఐదు నెలల్లో నమోదైన తల్లి మరణాలు, వాటికి గల కారణాలు, గర్భిణులకు అందుతున్న వైద్య సేవలు, అధిక ప్రమాద గర్భిణుల గుర్తింపు, చికిత్స తదితర అంశాలపై సమీక్షించారు. ప్రతి గర్భిణి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ అధిక ప్రమాద గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులను ముందుగానే గుర్తించి ప్రసవానికి ప్రణాళిక రూపొందించాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే మెరుగైన వైద్య సేవలు అందేలా పటిష్టమైన వైద్య తరలింపు వ్యవస్థను అమలు చేయాలని ఆదేశించారు. తల్లి మరణాలకు దారితీసిన కారణాలను లోతుగా విశ్లేషించి, భవిష్యత్తులో పునరావృతం కాకుండా నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది గర్భిణులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవ, అత్యవసర వైద్య సేవలు, రక్త నిల్వలు, మందుల లభ్యతను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జున, ఐసీడీఎస్ పీడీ రమాదేవి, డీసీహెచ్ఎస్ డా. రఫీక్ భాష, వైద్యాధికారులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్‌పై ప్రత్యేక నిఘా




ప్రొద్దుటూరు, సెప్టెంబరు 2: జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు ప్రొద్దుటూరు వన్‌టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల నాలుగు రోడ్ల కూడలి వద్ద బుధవారం సాయంత్రం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. మైనర్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించి వాహనాలను తనిఖీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై 20 కేసులు నమోదు చేసి రూ. 15,650 జరిమానా విధించారు. మైనర్ డ్రైవింగ్‌కు పాల్పడిన పిల్లల తల్లిదండ్రులను పిలిపించి వాహనాలు ఇవ్వడం వల్ల కలిగే ప్రమాదాలు, చట్టపరమైన పరిణామాలపై అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా ప్రయాణించాలని పోలీసులు సూచించారు.

# ఖరీఫ్‌లో సాగు చేసిన ప్రతి పంటకు తప్పనిసరిగా పంట నమోదు



ముద్దనూరు: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన ప్రతి పంటను రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట కృష్ణారెడ్డి సూచించారు. పొలం కలిగి ఉన్న ప్రతి రైతు ఫార్మర్ ఐడీ పొందాలని తెలిపారు. ముద్దనూరు మండలంలోని ఓబుళాపురం, గంగాదేవిపల్లి గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నమోదు చేసుకోని రైతులకు ప్రభుత్వ పథకాలు వర్తించవని తెలిపారు. సెప్టెంబర్ 10లోపు పంట నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని రైతు సేవా కేంద్రాల సిబ్బందికి సూచించారు. ఎల్‌నినో ప్రభావం పంటలపై పడకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, బెట్ట పరిస్థితుల నివారణకు ముందస్తు చర్యలు పాటించాలని సూచించారు. రైతులకు ఎల్‌నినోపై కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. అనంతరం రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంటలను పరిశీలించి దిగుబడుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకురాలు అంజనమ్మ, రైతులు గుత్తి కృష్ణారెడ్డి, మోపూరి జగదేశ్వరరెడ్డి, రాజారెడ్డి, రామసుబ్బారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, నరేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# కమలాపురంలో ఘనంగా వైయస్సార్ 17వ వర్ధంతి వేడుకలు..

## -కమలాపురం నియోజకవర్గ సమన్వయకర్త నరేన్ రామాంజులరెడ్డి నివాళులు..



కమలాపురం, సెప్టెంబర్ 02 : కమలాపురం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద గల వైయస్సార్ విగ్రహానికి కమలాపురం నియోజకవర్గ వైయస్సార్ సిపి ఇన్‌చార్జ్ నరేన్ రామాంజులరెడ్డి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ,రాజశేఖర్ రెడ్డి చనిపోయి 17 సంవత్సరాలు గడిచిన తెలుగు ప్రజల గుండెల్లో తెలుగువారు ఎక్కడున్నా వైయస్సార్ ను స్మరించుకుంటున్నారు. ఆదర్శవంతమైన జీవితం వైయస్సార్ ది అని,బాల్యం కూడా మేటి విద్యార్థిగా రాణిస్తు,ఉన్నత విద్య కోసం వైద్య వృత్తిని ఎంచుకొని రూపాయి డాక్టర్ గా ప్రజాసేవ చేస్తు,మరింత మెరుగైన సేవ చేయాలన్న తపనతో రాజకీయ రంగ ప్రవేశం చేసి,రాజకీయంగా ఏ ఎన్నికల్లోనైనా గెలుస్తు ముఖ్యమంత్రి అయ్యే వరకు ఓటమి చూడని వ్యక్తి వైఎస్సార్. వైయస్సార్ గారి రాజకీయ ప్రస్థానంలో పాదయాత్ర ఓ సంచలమైన రాజకీయ మలుపు. పాదయాత్ర ద్వారా 2004లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చిన ఘనత వైయస్సార్ ది. ఐదు సంవత్సరాల ఆరు మాసాల కాలంలో ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు ,పథకాలు ప్రవేశపెట్టి,వాటిని సమర్థవంతం గా అమలు చెసిన ఒకే ఒక్క ముఖ్యమంత్రి వైఎస్ఆర్ అని వాటి ద్వారా ప్రజల్లో గుండెల్లో చిరస్థాయిగా ముద్ర వేసుకున్న వ్యక్తి వైఎస్ఆర్. పేదల డబ్బుకు ఆరోగ్యానికి ముడి పడకూడదని ఆరోగ్యశ్రీని అమలు చేశాడు. 108, 104 లు పెట్టి ప్రజలకు ఆరోగ్య సేవలు అందించాడు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో జలయజ్ఞం ద్వారా రైతాంగానికి నీరు ఇచ్చి భూములను సస్యశ్యామలం చేశాడు. కరెంటు రుణాలు మాఫీ, ఫీజు రీయింబర్స్మెంట్, ముస్లింలకు 4% రిజర్వేషన్ అమలు చెసిన మహానుభావుడు. వైయస్సార్ జయంతి అయినా, వర్ధంతి అయిన తెలుగు ప్రజలు జరుపుకుంటున్నారంటే ఆయన ప్రజలకు చేసిన సేవ,మేలు వల్లనే. రాజశేఖర్ రెడ్డి ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు చేసిన సేవలను గుర్తించి భారతరత్న ఇవ్వాలని నరేన్ రామాంజులరెడ్డి డిమాండ్ చెసారు.

# పోలవరం ఎడమ కాలువ ప్రారంభోత్సవం హర్షనీయం.

## -పోలవరం ప్రాజెక్టు కాంగ్రెస్ పార్టీ మానస పుత్రిక.
## -డాక్టర్ నరెడ్డి తులసి రెడ్డి.



వేంపల్లి,సెప్టెంబర్ 02 : ఉత్తరాంధ్రకు సాగునీరు, త్రాగు నీరు, పారిశ్రామిక నీరు అందించే పోలవరం ఎడమ కాలువకు బుధవారం ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేయడం హర్షనీయమని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నరెడ్డి తులసి రెడ్డి అన్నారు. బుధవారం వేంపల్లిలో తులసి రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ పోలవరం బహుళార్థ సాధక ప్రాజెక్టు ప్రకృతి ఆంధ్రప్రదేశ్ కు ప్రసాదించిన వరమని, ఈ ప్రాజెక్టు కాంగ్రెస్ పార్టీ మానస పుత్రిక అని అన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఏడు లక్షల ఇరవై వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు, పది లక్షల పదమూడు వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని,540 గ్రామాలలో 28.5 0 లక్షల మందికి త్రాగునీరు అందుతుందని, విశాఖపట్నం కి తాగునీరు,విశాఖ ఉక్కు కర్మగారానికి కావలసిన పారిశ్రామిక నీరు తో పాటు 960 మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తి అవుతుందన్నారు.ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో 1942లో 200 అడుగుల ఎత్తున పోలవరం ప్రాజెక్టు నిర్మించాలని ప్రతిపాదన రాగా, ఆ ఎత్తులో నిర్మిస్తే భద్రాచలం గుడి మునుగుతుందన్న కారణం తో 1980 లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అంజయ్య ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దీని ఎత్తును 150 అడుగులకు తగ్గించడం జరిగింది.2004 జూలైలో కాంగ్రెస్ పాలనలో ఈ ప్రాజెక్టుకు పరిపాలన మంజూరు చేయడం జరిగింది.2004 – 2014 మధ్య రాష్ట్ర బడ్జెట్ నుండి కాంగ్రెస్ పాలనలో రూ 5136 కోట్లు ఖర్చు చేయడం జరిగింది.మొత్తం ప్రాజెక్టులో 32 శాతం పనులు కాంగ్రెస్ పాలనలో జరిగాయి. కాంగ్రెస్ పాలనలో 90 శాతం అనుమతులు వచ్చాయి.కుడి కాలువ పనులు 80 శాతం, ఎడమ కాలువ పనులు 45 శాతం జరిగాయి. పోలవరం ప్రాజెక్టు పూర్తి కాకపోయినప్పటికీ కుడి కాలువ పనులు పూర్తయ్యాయి.పోలవరం జలాశయం నుండి గ్రావిటీ ద్వారా గోదావరి జలాలు కుడి ఎడమ కాలువల ద్వారా ప్రవహించినప్పుడే పోలవరం ప్రాజెక్టు పూర్తయినట్టు లెక్క. ప్రస్తుతానికి పురుషోత్తపట్నం,పుష్కర ఎత్తిపోతల పథకాల ద్వారా మాత్రమే గోదావరి జలాలను ఎడమ కాలువలోకి పంపడం జరుగుతుంది. పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించి పోలవరం ప్రాజెక్టు ఎత్తును 150 అడుగుల మేర నిర్మించి గ్రావిటీ ద్వారా ఎడమ కాలువలోకి గోదావరి జలాలు పంపించేటందుకు కృషి చేయాలని తులసి రెడ్డి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.

# పులివెందులలో ఘనంగా డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు



పులివెందుల,సెప్టెంబర్ 02 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులుపవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను పులివెందులలోజనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాలు జనసేన పార్టీ పులివెందుల ఇంచార్జ్ డాక్టర్. హరీష్ ఆధ్వర్యంలో ఉత్సాహభరితంగా జరిగాయి.జన్మదిన వేడుకల సందర్భంగా వేంపల్లి నుండి పులివెందుల వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించి జనసేన పార్టీ శ్రేణులు, పవన్ కళ్యాణ్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం మరియు పవన్ కళ్యాణ్ గారి ఆయురారోగ్యాల కోసం ప్రత్యేకంగా ప్రార్థనలు చేశారు.తదుపరి భారీ కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పవన్ కళ్యాణ్ గారి నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం జనసేన పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మల్లికార్జున, సింహాద్రిపురం మార్కెట్ యార్డ్ డైరెక్టర్ జ్యోతి,హితేష్ రాయల్, దేవా, సుధీరెడ్డి, గోసుల అంజనేయులు, రౌతు నాగేంద్ర, మల్లేష్, దాసరి నారాయణ స్వామి, అశోక్, లక్ష్మణ్, జయచంద్ర, పట్టే ఉదయ్, ముక్తార్, తదితర జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. జనసేన శ్రేణుల నినాదాలతో పులివెందుల ప్రాంతం మారుమోగింది. పవన్ కళ్యాణ్ గారి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని నిర్వహించిన బైక్ ర్యాలీ, కేక్ కటింగ్ కార్యక్రమాలు ప్రజల్లో మరియు జనసేన అభిమానుల్లో విశేష ఉత్సాహాన్ని నింపాయి.



# దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వైయస్సార్ సేవలు మరువలేము..

## -వైఎస్ఆర్ విద్యార్థి విభాగం జిల్లా ప్రధానకార్యదర్శి మంచాల శ్యామ్ , కడప సిటీ ప్రధాన కార్యదర్శి హేమంత్..



కమలాపురం,సెప్టెంబర్ 02: దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతి సందర్భంగా వైఎస్ఆర్ విద్యార్థి విభాగం కడప జిల్లా ప్రధానకార్యదర్శి మంచాల శ్యామ్ మరియు కడప సిటీ విద్యార్థి విభాగం ప్రధానకార్యదర్శి హేమంత్ ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్ఆర్ స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో వర్ధంతి సందర్భంగా వైఎస్ఆర్ జోహార్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగానికి వైఎస్ఆర్ చేసిన సేవలను కొనియాడారు. కడపలోయోగి వేమన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసి ఎందరికో విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పించారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం నాయకులు నగర అధ్యక్షుడు తాతగారి శివ రెడ్డి, విద్యార్థి విభాగం నగర ప్రధాన కార్యదర్శి రవి, విష్ణు,అబ్దుల్,మని, కార్తీక్,శ్రీను రాయల్ , ముకేశ్, యోగి వేమన యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.

# పార్నపల్లిలో ఘనంగా డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు



లింగాల, సెప్టెంబర్ 02 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులుపవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను పార్నపల్లిలో జనసేన నాయకులు, కార్యకర్తలు, కూటమి శ్రేణులు,అభిమానులు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాలు జనసేన పార్టీ లింగాల ఇంచార్జ్ దాసరి నారాయణ స్వామి ఆధ్వర్యంలో ఉత్సాహభరితంగా జరిగాయి.జన్మదిన వేడుకల సందర్భంగా జనసేన పార్టీ శ్రేణులు, పవన్ కళ్యాణ్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం మరియు పవన్ కళ్యాణ్ గారి ఆయురారోగ్యాల కోసం ప్రత్యేకంగా ప్రార్థనలు చేశారు.తదుపరి భారీ కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పవన్ కళ్యాణ్ గారి నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం జనసేన పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎం శ్రీనివాసులు నాయుడు, కదిరి వంశీ తదితర జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.జనసేన శ్రేణుల నినాదాలతో పార్నపల్లి ప్రాంతం మారుమోగింది.పవన్ కళ్యాణ్ గారి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని నిర్వహించిన కేక్ కటింగ్ కార్యక్రమాలు ప్రజల్లో మరియు జనసేన అభిమానుల్లో విశేష ఉత్సాహాన్ని నింపాయి.

# పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన మారెడ్డి లతారెడ్డి




పులివెందుల, సెప్టెంబర్ 02 : పులివెందుల టీడీపీ కార్యాలయంలో డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఘనంగా నిర్వహించారు. పులివెందుల జడ్పీటీసీ మారెడ్డి లతారెడ్డి , వేంపల్లె టీడీపీ ఇన్‌చార్జ్ అజ్జుగుట్టు రఘునాథరెడ్డి , మారెడ్డి రామ్‌రెడ్డి కేక్ కట్ చేసి పవన్ కళ్యాణ్ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మారెడ్డి లతరెడ్డిమాట్లాడుతూ,గ్రామీణ రహదారుల అభివృద్ధి, తాగునీటి సౌకర్యాల కల్పన, పల్లె పండుగ ద్వారా గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపు, గిరిజన ప్రాంతాలకు రహదారి సౌకర్యాల విస్తరణతో పాటు పంచాయతీలను బలోపేతం చేస్తూ సీఎం చంద్రబాబు నాయకత్వంలో పవన్ కళ్యాణ్ గ్రామీణ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారు. అజ్జుగుట్టు రఘునాథరెడ్డి మాట్లాడుతూకూటమి ప్రభుత్వం పారదర్శక పాలన, ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్న పవన్ కళ్యాణ్ గారి సేవలు అభినందనీయమని అన్నారు. ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు భరత్ రెడ్డి, యువరాజ్, తదితరులు పాల్గొన్నారు...

Editor, Printed, Published and Owned by VASANTHA SREENIVASULA REDDY, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, Y.S.R., ANDHRA PRADESH - 51600. RNI REG NO:- APTEL/26/A0309.
Printed at. VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, Y.S.R., ANDHRA PRADESH - 516002. Editor: VASANTHA SREENIVASULA REDDY, E-mail: sreenu1167@gmail.com, Cell: +91 8341698284